క్లుప్తంగా

రోడ్లపై కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లు నడపొద్దు



వర్ధన్నపేట : బురద దున్నడానికి వినియోగించే కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లను రోడ్లపై నడపొద్దని ఎస్‌హెచ్‌ఓ చందర్ కోరారు. పట్టణంలో గురువారం ఆయన మాట్లాడారు. కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లు నడిపితే రోడ్లు దెబ్బతింటున్నాయని తెలిపారు. కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లను రోడ్లపై నడుపుతూ పట్టుబడితే మొదటిసారి రూ.10 వేలు, రెండోసారి రూ.20 వేలు జరిమానా విధిస్తామని, మూడో సారి ట్రాక్టర్ సీజ్ చేస్తామని వివరించారు. ట్రాక్టర్ల యజమానులు నిబంధనలు పాటించాలని కోరారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి



ఖానాపురం : విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం తప్పనిసరిగా నాణ్యత పాటించాలని ఎంపీడీఓ సునీల్‌కుమార్ కోరారు. మండలంలోని దబ్బీర్‌పేటలోని ప్రభుత్వ స్కూల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. వంట నిర్వాహకులు, ఉపాధ్యాయులకు సూచనలు చేసారు. భోజనం నాణ్యతతో లేకుంటే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరుణ్, హెచ్‌ఎంలు వెంకట్రామ్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పన్నులు పూర్తిగా వసూలు చేయండి



దుగ్గొండి : గ్రామాల్లో ఇంటి, నల్లా, ఇతర పన్నులను పూర్తిగా వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన గ్రామాల వారీగా పన్నుల వివరాలను సమీక్షించారు. అనంతరం మాట్లాడారు. ఇంటి, నల్లా, ఇతర పన్నులతోపాటు ట్రేడ్ లైసెన్స్ ఫీజు, సెల్ టవర్ బిల్లులు సత్వరమే వసూలు చేయాలన్నారు. పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను క్షుణ్ణంగా సిద్ధం చేయాలని చెప్పారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి మోడెం శ్రీధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



రాయపర్తి : మండలంలోని కొలన్‌పల్లికి చెందిన తోట రాధమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందగా ఆమె మృతదేహానికి మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జక్కుల వెంకట్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుమారుడైన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నర్సింగం, పీఏసీఎస్ డైరెక్టర్ యోగానందంలను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు బద్దం వేణుగోపాల్‌రెడ్డి, చిట్యాల వెంకన్న, వంగాల నర్సయ్య, సంకినేని ఎల్లస్వామి, చందు సతీశ్, కడుదుల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన ఐత రజితకు ఆమె తల్లి కొమురమ్మ మృతి చెందిన క్రమంలో పదో తరగతి నాటి స్నేహితులు గురువారం రూ.9 వేల సాయం అందజేశారు. తొలుత కొమురమ్మకు నివాళులర్పించారు. రజితను పరామర్శించారు. కార్యక్రమంలో రజిత స్నేహితులు మాచర్ల పరమేశ్వర్, ఉండాడి సురేశ్, మహేశ్వరి, ఐత రాజు, ఐత రాజేశ్, ఉండాడి రవీందర్, అనిత తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

రాయపర్తి : మండలంలోని కొత్తూరుకు చెందిన కందికట్ల కొమురమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్‌నాయకులు గురువారం 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. తొలుత కొమురమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కందికట్ల యాకయ్య, నాయకులు కందికట్ల సంతోశ్, కందికట్ల కొమురయ్య, చిర్ర బాబు, దొమ్మటి కుమారస్వామి, నాలం రవి, బోనగిరి సంపత్, తానికొండ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

బడుల బలోపేతానికి కార్యాచరణ

● ఉపాధ్యాయుల సెల్ వినియోగానికి చెల్లు



విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

నెక్కొండ : ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి. ఈ విషయమై ఉపాధ్యాయ సంఘాలూ హర్షిస్తున్నాయి. ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు విద్యార్థులను చదువులకే పరిమితం చేయకుండా ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తోంది. విద్యార్థులకు తరగతి గదిలో ఏకాగ్రత దెబ్బతినకుండా ఉపాధ్యాయుల సెల్‌ఫోన్ వినియోగాన్ని నిషేధిస్తూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

కృత్రిమ మేధ ఆధారిత అభ్యసన

ప్రాథమిక స్థాయిలో అభ్యసనలో తెలుగు, ఆంగ్లం, గణితంలో వెనుకబడిన విద్యార్థులు నేర్చుకోవడం, నేర్చుకున్న దాన్ని స్వయంగా పరీక్షించుకోవడం, తద్వారా అభ్యసనలో చురుగ్గా పాల్గొనడం లక్ష్యాలుగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత అభ్యసన కార్యక్రమాలు రూపొందించారు. ప్రభుత్వం విద్యార్థులకు పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్యాబోధన అందించే దిశగా పలు నిర్ణయాలు తీసుకుంటోంది.

ఉపాధ్యాయుల సెల్‌ఫోన్ వినియోగం నిషేధం

మండలంలోని 9 హైస్కూళ్లు, 8 ప్రాథమికోన్నత పాఠశాలలు 8, 30 ప్రాథమిక స్కూళ్లు ఉన్నాయి. అలాగే మొత్తం 2214 మంది విద్యార్థులు చదువుకుంటుండగా 218 మంది ఉపాధ్యాయులు విద్యాబోధన అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇకపై తరగతి గదిలో సెల్‌ఫోన్ వినియోగించడం నిషేధం. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొద్దిరోజుల క్రితం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తరగతి గదిలో సెల్‌ఫోన్‌లో మాట్లాడితే చర్యలు తప్పవని స్పష్టం చేసింది. ఉపాధ్యాయులు తరగతి గదుల్లో ఫోన్లు మాట్లాడడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా పిల్లల చదువుపై దుష్ప్రభావం పడుతోందన్న నిపుణుల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

సమయం వృథా కాకుండా..

తరగతి గదుల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ మాట్లాడడం వల్ల సమయం వృథా అయ్యే అవకాశం ఉంది. అంతేకాకుండా విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతినడమూ ఖాయం. ఈ క్రమంలో సుదీర్ఘ అధ్యయనం అనంతరం సెల్‌ఫోన్ వినియోగాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

కఠిన చర్యలు



ఉపాధ్యాయులు తరగతి గదుల్లోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లొద్దు. పాఠం మధ్యలో ఫోన్ మాట్లాడితే చర్యలు తప్పవు. స్కూల్‌కు ఫోన్ తీసుకొచ్చినా హెచ్‌ఎంకు అప్పగించాలి. విద్యాబోధన నడుమ సెల్ వినియోగిస్తే విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతినే ప్రమాదం ఉంది. ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలి.

– రత్నమాల, ఎంఈఓ

పాఠశాలకు వాటర్ ట్యాంకు వితరణ



వర్ధన్నపేట : హెచ్‌ఎంకు వాటర్ ట్యాంక్‌ను అందజేస్తున్న వ్యాపారి ప్రకాశ్



పర్వతగిరి : ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న జూలపల్లి సంపత్‌రావు, హెచ్‌ఎం, తదితరులు

వర్ధన్నపేట : పట్టణంలోని కృష్ణ జ్యువెలర్స్ యజమాని ప్రకాశ్ స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు విద్యార్థుల కోసం వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన సింటెక్స్ వాటర్ ట్యాంక్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌ను హెచ్‌ఎం రంగా అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి వ్యాపారులు, ఎన్‌ఆర్‌ఐలు, పూర్వవిద్యార్థుల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుసుమ కుమారస్వామి, మనుజేందర్‌రెడ్డి, అశోక్, బరిగల దేవయ్య, కల్యాణి, రోహిణి, ఫిజికల్ డైరెక్టర్ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పెయింట్ బకెట్ల వితరణ

మండలంలోని ల్యాబర్తి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌కు బొంపెల్లి ఎర్రబెల్లి సంపత్‌రావు, బొంపెల్లి ఎర్రబెల్లి హనుమంతరావు గురువారం పెయింట్ బకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి సహకారం అందించినట్లు తెలిపారు. వారిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

పర్వతగిరి : మండల కేంద్రంలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పూర్వవిద్యార్థి జూలపల్లి సంపత్‌రావు అతడి కూతురు నీలిమ జ్ఞాపకార్థం హెచ్‌ఎం పాక రమేశ్ బాబు సమక్షంలో స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. విద్యార్థులు మెడిసిన్, ఇతర ఉన్నత విద్య అభ్యసించడానికి కృషి చేస్తే తన కుటుంబం తోడ్పాటు అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంపత్‌రావు కుమారుడు నితీన్ రావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వనభోజనాలు



సంగెం : మండలంలోని గవిచర్ల గ్రామస్తులు గురువారం వనభోజనాలు కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి కీడు సోకడం వల్లే ఇటీవల వరుసగా మరణాలు చోటు చేసుకుంటున్నాయని భావించి అందరు వనభోజనాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. గ్రామంలోని అన్ని కుటుంబాలూ తెల్లవారుజామునే వనభోజనాలకు తరలివెళ్లాయి.

సాహూ మహరాజ్ జయంతి



వర్ధన్నపేట : పట్టణంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఛత్రపతి సాహూ మహరాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. సాహూ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలోనే తొలిసారిగా తన రాజ్యంలో కులాలు, మతాలకు అతీతంగా రిజర్వేషన్ కల్పించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, జిల్లా కన్వీనర్ జంగిల్ భాస్కర్, తెలంగాణ దళిత స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నపెల్లి కృష్ణ, ఎంఆర్‌పీఎస్ పొలిట్‌బ్యూరో సభ్యులు ఈరెల్లి శ్రీనివాస్, కుమారస్వామి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

పర్వతగిరి : రైతులు పట్టాదార్ పాస్‌బుక్కులు, పహాణిలతో వచ్చి బ్యాంకు రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక సహకార బ్యాంకు చైర్మన్ మనోజ్‌గౌడ్ కోరారు. బ్యాంకు కార్యాలయంలో ఆయన రైతులతో గురువారం మాట్లాడారు. గతంలో తీసుకున్న రైతులు సకాలంలో వడ్డీ చెల్లించి రుణాలు రెన్యూవల్ చేసుకోవాలని చెప్పారు. సకాలంలో చెల్లించకపోతే వడ్డీ 57 పైసల నుంచి రూ.1.10లకు చేరుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు సార్వత్రిక సమ్మె

● సీఐటీయూ మండల అధ్యక్షుడు రాంచందర్



ఎంపీడీఓకు నోటీసు అందజేస్తున్న నాయకులు

పర్వతగిరి : కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జూలై 9న సార్వత్రిక సమ్మె తలపెట్టినట్లు సీఐటీయూ (గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్) మండల అధ్యక్షుడు నకరకంటి రాంచందర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఎంపీడీఓ శంకర్ నాయక్‌కు గురువారం నోటీసు అందజేసింది. అనంతరం రాంచందర్ మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా సవరించి కార్మికులకు తీరని అన్యాయం చేసేలా, కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించిందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, స్థానిక సంస్థలకు నిధులు కేటాయించి ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు 8 గంటల పని దినాలను అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు వడ్డే కుమారస్వామి, గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి గజ్జల మౌనిక, నాయకులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

కిరాణా షాపుపై టాస్క్‌ఫోర్స్ దాడి

● రూ.1.61 లక్షల విలువైన గుట్కా స్వాధీనం



గుట్కా ప్యాకెట్లను చూపిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజు

ఖిలా వరంగల్: అక్రమంగా గుట్కాలు విక్రయిస్తున్న కిరాణం షాపు వ్యాపారిపై కేసు నమోదు చేసి, అతడి నుంచి రూ.1,61,850 విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. వరంగల్ శివనగర్‌లోని సాయిబాబా గుడి లేన్‌కు చెందిన వేముశెట్టి విశ్వనాథం తన కిరాణం షాపులో గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు అందించిన సమాచారం మేరకు ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు ఆధ్వర్యంలో గురువారం దాడి చేశారు. విశ్వనాథంపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కేసును మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు వివరించారు.

ఎంఆర్‌పీఎస్ కమిటీ ఎన్నిక



రాయపర్తి : మండలంలోని సన్నూరులో ఎంఆర్‌పీఎస్ గ్రామ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల ఎన్నికల ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించిన జిల్లా ధర్మయ్య, వళపాక కుమార్ ప్రకటించారు. అధ్యక్షుడిగా చిన్నపాక రవి, ఉపాధ్యక్షుడిగా ఈరెల్లి హరీశ్, ప్రధాన కార్యదర్శిగా చిన్నపాక కుమార్, కార్యదర్శిగా చెరిపెల్లి దయాకర్, కోశాధికారిగా కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్, మణి, మనోహర్, ప్రవీణ్, ముఖేశ్, యాకయ్య, అశోక్, ప్రశాంత్, సుధాకర్ ఎన్నికయ్యారు. అనంతరం కమిటీని ధర్మయ్య, కుమార్ అభినందించారు.

ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలి



యూకే విద్యార్థులతో ఇంటరాక్షన్‌లో పాల్గొన్న తాళ్ల పద్మావతి స్కూల్ విద్యార్థులు

ఖిలా వరంగల్ : విద్యార్థులు శాస్త్రీయ ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలని తాళ్ల పద్మావతి విద్యాసంస్థల డైరెక్టర్లు వైష్ణవి, వరుణ్ సూచించారు. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లోని హిల్ క్రాఫ్ట్ పాఠశాల విద్యార్థులతో వరంగల్ హంటర్‌రోడ్డు ఉర్సుగుట్ట సమీపంలోని తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థులు గురువారం ఆన్‌లైన్ వీడియో ద్వారా ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూకే విద్యార్థులతో అనేక అంశాలపై చర్చించి తమ అభిప్రాయాలను పంచుకున్నారు. వ్యవసాయ, వాతావరణ మార్పులు, వరదల ప్రభావం వంటి సమకాలీన అంశాలపై చర్చలు జరగడంతోపాటు రెండు పాఠశాలల విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్టులను పరస్పరం పంచుకున్నారు. అనంతరం తాళ్ల పద్మావతి డైరెక్టర్లు వైష్ణవి, వరుణ్ మాట్లాడుతూ ఇంటరాక్షన్ ద్వారా విద్యార్థులు పరస్పరం నూతన విషయాలు తెలుసుకుని, విదేశీ మిత్రులతో మైత్రి బంధాలను ఏర్పర్చుకున్నారని వివరించారు.

పెట్రోల్ బంక్‌లో మోసం

గూడూరు : మండలంలోని బొద్దుగొండ శివారులోని పెట్రోల్ బంక్‌లో గురువారం నిర్వాహకుల మోసాన్ని వాహనదారులు బయటపెట్టారు. పెట్రోల్ తక్కువ వస్తుందనే అనుమానంతో కొందరు వాహనదారులు తూనికలు కొలతల శాఖ ఇచ్చిన లీటరు, అర లీటర్ పెట్రోల్ పావుల ద్వారా నీటిని, పెట్రోల్‌ను కొలిచి, బంక్‌లో పెట్రోల్, డిజిల్ తక్కువగా వస్తుందని గ్రహించారు. కొలతలకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.

30న రాష్ట్రస్థాయి కళాకారుల సదస్సు

ఖిలా వరంగల్ : ఈనెల 30న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర స్థాయి కవులు, కళాకారులు సదస్సు నిర్వహించనున్నట్లు ప్రజా నాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కేతరాజు ఉప్పలయ్య తెలిపారు. వరంగల్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో వరంగల్ జిల్లా కళాకారులు గన్నారపు రమేశ్, దామెర కృష్ణ అధ్యక్షతన ప్రజానాట్య మండలి ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడారు.

డ్రగ్స్ నిర్మూలన సామాజిక బాధ్యత



నెక్కొండ : డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై మాట్లాడుతున్న నరేశ్‌రెడ్డి



సంగెం : మాట్లాడుతున్న ఎస్సై నరేశ్



వర్ధన్నపేట : ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు

నర్సంపేట/నెక్కొండ/వర్ధన్నపేట/సంగెం/రాయపర్తి : డ్రగ్స్ నిర్మూలనను సామాజిక బాధ్యతగా నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్, నెక్కొండ ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి, వర్ధన్నపేట సీఐ శ్రీనివాస్, సంగెం ఎస్సై నరేశ్, కొండూరు హైస్కూల్ హెచ్‌ఎం పద్మలత అభివర్ణించారు. నర్సంపేట, నెక్కొండ, వర్ధన్నపేట, సంగెం, రాయపర్తి మండలాల్లో గురువారం డ్రగ్స్ నివారణ దినోత్సవాలు నిర్వహించారు. డ్రగ్స్ నిర్మూలనకు పాటుపడతామంటూ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ నవీన్, రాయపర్తి మండలంలోని కొండూరు హైస్కూల్ హెచ్‌ఎం పద్మలత విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్, గుట్కా, గంజాయి, తదితరాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.



నర్సంపేట : ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్



రాయపర్తి : ప్రతిజ్ఞ చేయిస్తున్న హెచ్‌ఎం

శుభ్రతతో సీజనల్ వ్యాధులకు చెక్



విద్యార్థినికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ జ్యోతి

● డాక్టర్ జ్యోతి

ఖానాపురం : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టాలని పీహెచ్‌సీ వైద్యాధికారి జ్యోతి కోరారు. మండలంలోని ఐనపల్లి మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ జ్యోతి మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు శుభ్రత పాటించడాన్ని దినచర్యలో భాగంగా అలవర్చుకోవాలని సూచించారు. ప్రతిరోజూ భోజనం చేసే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, తదితర సూచనలు అందించారు. అనారోగ్య సమస్య తలెత్తితే వెంటనే అధ్యాపకుల దృష్టికి తీసుకెళ్లి వైద్యులను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ దామోదర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు భాస్కర్, జ్యోతి, ప్రిన్సిపాల్ జయశ్రీ, శిరీష, పల్లవి, అక్షయ, రిషిత, అఖిత, నందిత, తదితరులు పాల్గొన్నారు.

సంఘాల లావాదేవీల్లో పారదర్శకత కీలకం

● డీఆర్‌డీఓ ఏపీడీ రేణుకాదేవి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ ఏపీడీ రేణుకాదేవి

సంగెం : మహిళా సంఘాల లావాదేవీల్లో పారదర్శకత కీలకమని డీఆర్‌డీఓ ఏపీడీ రేణుకాదేవి తెలిపారు. మండలంలోని శాంతి మండల సమాఖ్యలో 49 గ్రామ సంఘాల్లోని అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారులకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. సంఘాల లావాదేవీలన్నిటిని పుస్తకంలో విధిగా నమోదు చేయాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు ఇతరులపై ఆధారపడకుంగా సొంతంగా పనులు చేసుకోవాలని తెలిపారు. సంఘాల బలోపేతంలో అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారి కీలకమన్నారు. లావాదేవీలను పారదర్శకంగా నిర్వహిస్తూ సభ్యులకు నమ్మకం కలిగించాలని కోరారు. కార్యక్రమంలో డీపీఎం దయాకర్, ఏపీఎం కిషన్, ఎస్‌ఆర్‌పీలు లక్ష్మి, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

రేపటి ధర్నాను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఇస్మాయిల్

సంగెం : ప్రజాసమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రేపు (28న) తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి ఇస్మాయిల్ కోరారు. మండలంలోని కుంటపల్లిలో గురువారం నిర్వహించిన గ్రామ కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయడంతోపాటు భూభారతి దరఖాస్తుదారులకు హక్కుపత్రాలు ఇవ్వాలని, రైతులకు సరఫడా ఎరువులు అందుబాటులో ఉంచాలని, తదితర డిమాండ్లతో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు హాజరు కావాలని కోరారు. సమావేశంలో నాయకులు గోనె రాంచందర్, రౌతు శ్రీనివాస్, రాగి రవి, దుండి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు 'చలో ఇందిరా పార్క్'

సంగెం : నేడు (శుక్రవారం) చలో ఇందిరా పార్క్ ధర్నా తలపెట్టినట్లు డీటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యుడు సూరయ్య కోరారు. గురువారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కూళ్లను సెమీ రెసిడెన్సియల్ పాఠశాలలుగా ఉన్నతీకరించడంతోపాటు ఖాళీగా ఉన్న ఎంఈఓ, డీఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, తదితర సమస్యల పరిష్కారం కోసం ధర్నా తలపెట్టినట్టు తెలిపారు. ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు.

క్షీరాభిషేకం

గూడూరు : మండలంలోని గుండెంగలో గురువారం సీఎం చిత్రపటానికి గ్రామ పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కందిక కృష్ణ మాట్లాడారు. రైతు సంక్షేమమే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని రైతు భరోసా నిధుల పంపిణీతో ప్రజలకు తెలిసిందన్నారు. కార్యక్రమంలో నెక్కొండ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ కందిక సుమలత, శంకర్, కందిక దామోదర్, బోడ మహేశ్ పాల్గొన్నారు.